# ప్రమాదకరంగా రైల్వే అండర్ బ్రిడ్జి

- డ్రైయినేజీ లేక రోడ్డుపై నిలుస్తున్న వరద
- విద్యుత్ సౌకర్యం లేక రాత్రిళ్లు అంధకారం
- ఎలాంటి సూచిక బోర్డులూ లేవు..



ప్రమాదకరంగా మారిన రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి

**మణుగూరురూరల్:** మున్సిపాలిటీలోని పట్టణ ప్రధాన రహదారి నుంచి రాజుపేటకు వెళ్లే మార్గ మాధ్యంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గం గుండానే గ్రామస్తుల పలు వాహనాలు, మణుగూరు ఓసీ, ఓబీ కంపెనీలకు వెళ్లే బొగ్గు లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి వద్దకు చేరుకోగానే భయాందోళన చెందుతున్నారు.

**రూ.లక్షలతో బ్రిడ్జి.. రక్షణ చర్యలు శూన్యం**

లక్షల రూపాయలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మించిన అధికారులు కానీ, సింగరేణి యాజమాన్యం కానీ.. రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలం చెందినట్లు తెలుస్తోంది. బ్రిడ్జి ప్రాంతంలో సరైన విద్యుత్ సౌకర్యం లేదు. వర్షం పడితే వరదనీరు ప్రవహించేందుకు సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేదు. రాత్రి వేళల్లో విద్యుత్ వెలుగులు లేక ఏమీ కనిపించని వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డు కిందికి ఉంది. ఇక్కడ వర్షాకాలంలో వరద నీరంతా నిలిచే అవకాశం ఉంది. అలాంటి సమయంలో రహదారి కనబడక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ అలాంటి ప్రమాదాలే జరిగాయి.

**నిర్లక్ష్య ధోరణిలో అధికారులు**

నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతున్న ఈ రహదారి ప్రమాదభరితంగా మారినప్పటికీ అటు సింగరేణి అధికారులుగాని, సంబంధిత శాఖ అధికారులుగాని పట్టించుకున్నది లేదు. బ్రిడ్జి ప్రాంతంలో వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా, వరదనీరు నిల్వకుండా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ప్రమాదాలు జరగకుండా కనీసం హెచ్చరికల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. అధికారులు ఇలా నిర్లక్ష్యం ప్రదర్శించడంపై వాహనదారులు, స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు, అధికారులు

**బూర్గంపాడు:** ప్రకృతి వైపరీత్యాలపై బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోదావరి వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తమను తాము కాపాడుకోవటంతో పాటుగా ఇతరులను కాపాడేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలి, అనుకోకుండా పడిపోయిన వ్యక్తులను సీపీఆర్ చేసి ఎలా కాపాడుకోవాలి, గ్యాస్ లీకైన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, మంటలను ఎలా అదుపు చేయాలి తదితర విషయాలపై ప్రదర్శనలు చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎస్‌ఐ మేడ ప్రసాద్, ఎంఈఓ యదుసింహరాజు, ప్రిన్సిపాల్ చీన్యా తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానాను ప్రారంభించండి

**చర్ల:** మారుమూల ప్రాంతంలోని కుర్నపల్లిలో గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు నిర్మించిన పల్లె దవాఖానాను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు నేతృత్వంలో సీపీఎం బృందం కుర్నపల్లి ప్రాంతంలో పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాల్లో వైద్యాధికారులు, సిబ్బందిని భర్తీ చేయకపోవడంతో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని, గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని అన్నారు. కుర్నపల్లి–రామచంద్రాపురం గ్రామాల మధ్య ఉన్న గుండ్ల వాగుపై వంతెన లేకపోవడం, గ్రామాల్లో కనీసం వీధి దీపాలను లేకపోవడం తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వెంటనే అధికారులు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, పి.సమ్మక్క, బందెల చంటి, హరినాగవర్మ, నవీన్, షారోని, వరలక్ష్మి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బదిలీలతో వేతనాలకు బ్రేక్

**అశ్వాపురం:** మండలంల నూతన ఎంపీడీఓ బదిలీలు పలువురు సిబ్బంది వేతనాలను బలి చేశాయి. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఎంపీడీఓ రవీంద్రప్రసాద్‌ను అశ్వాపురం ఎంపీడీఓగా బదిలీ చేశారు. ఆయన ఈనెల 9న బాధ్యతలు చేపట్టారు. అయితే, ఇటీవల ఎంపీడీఓల బదిలీలకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు లేవని రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఎంపీడీఓ సంతకంతో ఎస్‌టీఓకు పంపిన ఎంపీడీఓ, ఆ కార్యాలయ సిబ్బంది వేతనాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఆర్థిక శాఖ నుంచి క్లియరెన్స్ వస్తేనే వేతనాలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అశ్వాపురంతో పాటు గుండాల, ములకలపల్లి, అశ్వారావుపేట, టేకులపల్లి, పలు ఇతర మండలాల ఎంపీడీఓలు కూడా బదిలీ అయ్యారు!.

### పనుల పరిశీలన

**అశ్వారావుపేటరూరల్:** పోడు పట్టాలు పొందిన గిరిజన రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వినాయకపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వినాయకపురం, దురదపాడు, గాడ్రల గ్రామాల్లో పోడు రైతుల పొలాలకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్లు, ఇతర పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. అశ్వారావుపేట మండలంలోని 104 మంది గిరిజన రైతుల పోడు భూములకు రూ.45లక్షల వ్యయంతో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్వంచ డీఈఈ నందయ్య, స్థానిక ఏడీఏ వెంకట రత్నం, ఏఈఈ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

### ‘ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి’

**బూర్గంపాడు:** రాజకీయ లబ్ధి కోసం కులాల మధ్య తగవులు సృష్టిస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు గుగులోత్ రాంబాబునాయక్ డిమాండ్ చేశారు. సారపాకలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్న కోయ, లంబాడల మధ్య భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు గొడవలు పెట్టి ఓ వర్గాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అందరి ఓట్లతో ఎన్నికలలో గెలిచి లంబాడీలను ఎస్టీల నుంచి తొలగించాలని సుప్రీంకోర్టులో కేసు వేయాడన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో భూక్యా సురేష్‌నాయక్, అజ్మీర వెంకన్న, తేజావత్ ప్రేమ్‌కుమార్, అంగోత్ రఘు, భూక్యా వినోద్‌కుమార్, బాదావత్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### మొబైల్ సేవలు ప్రారంభం

**చర్ల:** మండల సరిహద్దున గల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న బీమారంలో మొబైల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. బీజాపూర్ జిల్లాలో ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఈ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నియాద్ నెల్లానార్ పథకం కింద మంజూరైన నిధులతో జియో సెల్ టవర్‌ను ఏర్పాటు చేసి మంగళవారం ప్రారంభించారు. దీంతో బీమారం సమీపంలోని రాంపురం, ఉడతమల్ల, మల్లంపేట తదితర గ్రామాల్లో మొబైల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

### బీఆర్‌ఎస్ గ్రామ సమావేశం

**దమ్మపేట:** మండల పరిధిలోని చిన్నగొల్లగూడెంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజలకు తెలియజేసి.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావుల శ్రీను, జలగం వాసు, మచ్చ ముత్యాలు, వెంకటేశ్, మహాలక్ష్ముడు పాల్గొన్నారు.

### కాలువల్లో పూడికలు తీయాలి



వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ కాలువను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

**చండ్రుగొండ:** మండలంలోని సీతాయిగూడెం గ్రామంలో ఉన్న వెంగళరాయసాగర్ కాలువల్లో పూడికను సత్వరమే తీయాలని సీపీఎం అనుబంధ రైతుసంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. మండల రైతులకు ప్రధాన సాగునీటి వనరైన ప్రాజెక్ట్ అలుగుకు గండి పడి ఐదేళ్లయిన పాలకులు పట్టించుకోలేదన్నారు. తాజా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఫలితం లేదన్నారు. అధికారులు నిర్లక్ష్యం ఫలితంగానే ఈ ప్రాజెక్ట్ పరిస్థితి దారుణంగా మారిందని ఆయన విమర్శించారు. రైతుసంఘం నాయకులు పెద్దిని వేణ, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# నానో యూరియా వాడాలి



వరి పంటకు నానో యూరియా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏఓలు

**అశ్వారావుపేటరూరల్:** రైతులు పంటలకు పైపాటుగా యూరియాకు బదులుగా నానో యూరియాను వాడాలని అశ్వారావుపేట ఏడీఏ పి.రవి కుమార్ కోరారు. ఈ విషయంపై మంగళవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. నానో టెక్నాలజీ సాయంతో ఉత్పత్తి అయిన నానో యూరియా వల్ల మొక్కలకు బాగా పోషణకు అందుతుందని తెలిపారు. సాధారణ యూరియా నేలకు అందించడం వల్ల మట్టిలోని నత్రజనికి నష్టం కలుగుతోందని, నానో యూరియాను పంట ఆకులపై పిచకారీ చేయడం వల్ల దీనిని నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, ఏఓ శివరామ ప్రసాద్, ఏఈఓలు షాకిరా బాను, రవీంద్రరావు, సీఈఓ అరుణ, రైతులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరతపై నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**దమ్మపేట:** ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న రైతులకు అవసరమైన ఎరువులను సరిపడా నిల్వలను సకాలంలో అందుబాటులో ఉంచాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ బాధ్యులు మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులుకు అవసరమైన యూరియా, డీఏపీ తదితర ఎరువుల కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పండూరి వీరబాబు, కుంజా పాపారావు, రాముడు, వెంకటేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### వన్యప్రాణులను కాపాడుకోవాలి



వలస ఆదివాసీలతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

**ములకలపల్లి:** వన్య ప్రాణుల సంరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్‌ఓ) కె.శ్రీను అన్నారు. జాతీయ పులుల సంరక్షణా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలపరిధిలోని తోగ్గూడెం శివారులోగల చింతగుంపు వలస గొత్తికోయ గుంపు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అటవీ జంతువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ సతీష్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఉషారాణి

**అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ):** మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని నయీతాలీం సమితి జాతీయ అధ్యక్షురాలు పి.ఉషారాణి మంగళవారం ప్రారంభించారు. భారతీయ వాసవీక్లబ్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు రూ.40 వేల విలువైన పుస్తకాలను గ్రంథాలయాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, ఎర్రగుంట పాఠశాల ఉపాధ్యాయులు శాంతకుమారి, శంకర్‌మహాదేవన్, వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి, మీరాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలను నిలిపివేయండి



దుమ్ముగూడెం: రహదారిపై ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

**దుమ్ముగూడెం:** మండలం మీదుగా వెళ్లే ఇసుక లారీలను వెంటనే నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తూరుబాక బ్రిడ్జి నిర్మాణం వద్ద ధర్నా చేశారు. అనంతరం తూరుబాక బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లారీల తాకిడితో రోడ్లు గుంతలమయంగా తయారవుతున్నాయని, అనేక సార్లు అధికారులకు విన్నవించినప్పటికీ శాశ్విత పరిష్కారం చూపలేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎలమంచిలి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, బొల్లి సత్యనారాయణ, కొమరం చంటి, కుమ్మరి కుంట్ల సాంబశివరావు, బిల్లా ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ సమస్యలు పరిష్కరించాలని..**

**మణుగూరురూరల్:** మండలంలోని కూనవరం పంచాయతీ రేగులగండి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, నాయకులు నైనారపు నాగేశ్వరరావు, బండారి సారిక, భీమయ్య, కారం భీమయ్య, గంగరాజు, దేవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ‘డయల్ యువర్ డీఎం’

**భద్రాచలంఅర్బన్:** ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు.. 9959225960కు కాల్ చేసి సమస్యలను తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

### గురుకులంలో 31న స్పాట్ అడ్మిషన్లు

**ములకలపల్లి:** మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల/కళాశాలలో ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. కుల, జనన, ఆదాయ ధ్రువపత్రాలు, పదో తరగతి మార్కుల ఒరిజినల్ మెమోతో హాజరైతే.. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

### డ్రైయినేజీ నిర్మించాలి

**ములకలపల్లి:** మొండివర్రె గ్రామంలో డ్రైయినేజీ నిర్మించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు నిమ్మల మధు డిమాండ్ చేశారు. మంగళవారం క్షేత్రాసాయిలో గ్రామాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. గ్రామంలో వర్షపు నీళ్లు బయటకు వెళ్లేందుకు డ్రైయినేజీ లేకపోవడంతో, వీధులన్నీ బురదమయంగా మారాయని అన్నారు. దీంతో ఏజెన్సీ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే దృష్టి సారించాలని కోరారు.

### ఇసుక కూపన్లు ఇవ్వాలి

**దుమ్ముగూడెం:** మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కూపన్లను లబ్ధిదారులకు జారీ చేయాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్, కో–కన్వీనర్ కణితి రాముడు, ఎండీ జానీపాషాలు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగస్టు 4వ తేదీ నాటికి పునాది కట్టకపోతే ఇళ్లు రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికైనా అధికారులు మండలంలో ఇసుక నిల్వలను చూసి ఇందిరమ్మ ఇళ్లకు తోలుకునే విధముగా ఏర్పాట్లు చేయాలని కోరారు.

### చట్టాలను అమలు చేయాలి

**భద్రాచలంటౌన్:** ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు 1996 షెడ్యూల్ పార్లమెంట్ చట్టాన్ని అమలు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోందే వీరయ్య అన్నారు. స్థానిక ఐటీడీఏ ధర్నా చౌక్‌లో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీఓ ఎంఎస్ నెంబర్ 45 ప్రకారం ఏజెన్సీలోని చట్టాలను చిత్తశుద్ధితో అధికారులు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాయం సత్యనారాయణ, ఇర్ప ప్రకాష్, పూనెం వరప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు వితరణ

**దమ్మపేట:** మండల పరిధిలోని దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలకు అదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజేష్ పాఠశాల గ్రంథాలయానికి విలువైన పుస్తకాలను వితరణగా అందజేశారు. ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన బర్మావత్ రవీంద్ర కుమార్ ఇదే పాఠశాలకు క్రీడా వస్తువులను వితరణగా అందజేశారు. పుస్తకాలు, క్రీడా వస్తువులను స్వీకరించిన పాఠశాల హెచ్‌ఎం చంద్రకళ, ఇరువురు దాతలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విస్తృతంగా వాహన తనిఖీలు



క్రాస్‌రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ప్రసాద్

**బూర్గంపాడు:** మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో బూర్గంపాడు ఎస్‌ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేపట్టారు. మణుగూరు క్రాస్‌రోడ్ వద్ద వాహనాలను నిలిపి తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వాహనదారులు బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, లైసెన్స్, ఆధార్‌కార్డు దగ్గర ఉంచుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

### ఉపాధ్యాయులకు శిక్షణ

**దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ పాఠశాలలో 2025–26 మొదటి పాఠశాల సముదాయపు సమావేశాలను రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ సమావేశాల్లో పర్ణశాల, నర్సాపురం, దుమ్ముగూడెం పరిధిలోని ఉపాధ్యాయులు 175 మందికి శిక్షణ అందించారు. సమావేశంలో అకాడమిక్ మోనిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్ ఉపాధ్యాయులకు పాఠశాలల్లో గ్రంథాలయ వినియోగం, విద్యార్థులతో రీడింగ్ యాక్టివిటీస్ అభివృద్ధి చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, ప్రధానోపాధ్యాయులు ఏవీ రామారావు, బెక్కంటి శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజే ప్రభాకర్, రిసోర్స్ పర్సన్లు వేముల శ్రీను, రత్నాకర్, శ్రీనివాస్, కృష్ణార్జున్, వంశీ పాల్గొన్నారు.

### కల్వర్టుపైకి దూసుకెళ్లిన లారీ



లక్ష్మీపురం వద్ద కల్వర్టుపై నిలిచిన లారీ..

**బూర్గంపాడు:** టైరు పంక్చర్ కావటంతో లారీ అదుపు తప్పి కల్వర్టుపైకి దూసుకెళ్లిన ఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ వైపునకు వస్తున్న ఓ లారీ మంగళవారం ఉదయం లక్ష్మీపురం శివారుకు చేరుకోగానే టైరు పంక్చర్ అయిది. దీంతో లారీ అదుపు తప్పి కల్వర్టుపైకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ కూడా సురక్షితంగా బయటపడ్డాడు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

**ములకలపల్లి:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం మేరకు.. మండల పరిధిలోని కంపగూడెం శివారు పాములేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తోలుతున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమెదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఘనంగా నాగుల పంచమి

**దమ్మపేట:** మండల మండల పరిధిలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో నాగుల పంచమి పర్వదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజాము నుండే ఆలయాలకు తరలి వెళ్లి, భక్తిశ్రద్ధలతో నాగేంద్ర స్వామిని దర్శించుకున్నారు. దమ్మపేట గ్రామంలోని శివాలయంలో ఉన్న నాగేంద్ర స్వామికి అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

### సింగరేణి సీఎండీ జన్మదిన వేడుకలు



రక్తదాన కార్యక్రమంలో దాతలు, జీఎం దుర్గం రాంచందర్, అధికారులు

**మణుగూరుటౌన్:** సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంనాయక్ జన్మదిన వేడుకలను కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తలసేమియా పిల్లల కోసం ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం జీఎం దుర్గం రాంచందర్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఏరియా సేవా సమితి సభ్యులు హుమాయున్–లావ్యా దంపతుల ఆధ్వర్యంలోనూ మణుగూరులోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేసి వేడుకలు జరిపారు. అశ్వాపురం ఆరిఫా అండ్ రోష్నీ వృద్ధాశ్రమానికి క్వింటాబియ్యం అందజేసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

### విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

**దుమ్ముగూడెం:** మండలంలోని పైడాకులమడుగు పాఠశాలలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోడి జ్యోతి–సురేష్ దంపతులు మంగళవారం పెన్నులు, పలకలు, చాపలు, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల హెచ్‌ఎం రేసు శ్రీను ధన్యవాదాలు తెలియచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మట్టా లక్ష్మయ్య, వర్ష రామయ్య, కణితి రాముడు, వాగే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రహదారిపై మురుగు నీరు



ఇండస్ట్రియల్ ఏరియాలో నడి రోడ్డుపై పారుతున్న మురుగునీరు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని ఓ కాలనీలో ఉన్న రోడ్డుపై మురుగునీరు పారుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో డ్రైయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. దీంతో మురుగు నీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. దీంతో పరిసరాలు దుర్గంధ భరితంగా తయారయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు దీనిపై వెంటనే స్పందించి మురుగు నీరు రహదారిపైకి చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని సదరు కాలనీ వాసులు కోరుతున్నారు.